# లోక విద్యా ప్రపంచం

పక్షపత్రిక

లోకవిద్యాధరుల గొంతు

సంపుటి-1, సంచిక-3 16-అక్టోబర్ - 2013 సంపాదకుడు & ప్రచురణ కర్త : టి. నారాయణ రావు వెల. రూ. 2

## ప్రకృతినీ, ధర్మాన్నీ రక్షించండి - సుఖసంతోషాలతో జీవించండి.

భారతజాతి సంస్కృతిలో ధర్మాన్ని రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందని, వృక్షాలని రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయని కొన్నివేల సంవత్సరాల నుండి పురాణాల ద్వారా, ఇతిహాసాల ద్వారా, చరిత్రల ద్వారా మనం తెలుసుకోవటమే కాదు ఆచరిస్తున్నాం. ఇవి రెండూ ఏ రోజు ఆచరించడం మానేస్తామో ఆ రోజు నుంచే మన సమాజంలో ఘర్షణలు మొదలయ్యాయి, ప్రకృతి కూడా తిరగబడుతోంది. ఈ రోజు ధర్మాన్ని ఎంత దారి తప్పించారంటే నేను నా కుటుంబం, నాకులం, నాగ్రామం, నా ప్రాంతం, నా దేశం బాగుపడాలనే పాత కోరిక స్థానే ఇతర కుటుంబాలు పోయిన పర్వాలేదు, ఇతర కులాలు దెబ్బతిన్నా పర్వాలేదు, ఇతర మతాలు ఉండటానికి వీలులేదు, ఇతర ప్రాంతాలు, ఇతర దేశాలు నేను చెప్పినట్లు నడుచుకోవాలనే అధర్మ ప్రక్రియ మొదలైంది. ఇవే ఈనాటి సామాజిక ఘర్షణలకి ప్రధాన కారణం.

ఇక వృక్షాలు అంటే ప్రకృతి మనకిచ్చిన దానిని అనుభవిస్తూ దాన్ని పెంచి పోషించుకునే పాత అలవాట్ల స్థానే ప్రకృతి సంపదనంతా ఈతరంలోనే పూర్తిగా వెలికితీసి అత్యున్నత జీవన ప్రమాణాలు అందుకోవాలనే కోరికలో నుండి పుట్టిందే గనుల పేరుతో, ప్రకృతివిధ్వంసం. నీరు, భూమి అవసరాల పేరుతో, విద్యుత్ ప్రాజెక్టుల పేరుతో, నీటి పారుదల ప్రాజెక్టుల పేరుతో ఈ ప్రకృతిని పోయిన నాలుగైదు దశాబ్దాలుగా విపరీతముగా వాడకం కోసం నాశనం చేయడం కొద్ది మందిని అత్యంత ధనికులని చేసింది. దానితోపాటు ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరగటం, ఉన్నట్టుండి వరదలు రావటం, నాలుగైదు సంవత్సరాలు వానలే లేకపోవటం, భయంకరమైన వ్యాధులు వ్యాపించటం ద్వారా ప్రకృతి మనమీద తిరగబడుతోంది.

ప్రస్తుత ప్రపంచీకరణ తక్కువ శ్రమతో అత్యధిక ఉత్పత్తి చేసి, అత్యాధిక ధరలకు ప్రపంచంలో ఎక్కడైనా అమ్ముకుని, అత్యంత ధనికులు అయిపోవాలనే ఒక భూతం ప్రపంచాన్ని ఈ రోజు ఆవరించింది. ఈ ఉత్పత్తిలో మానవుడు కేంద్రంకాదు. లాభాలే కేద్రం. ఉపాధి కోల్పోయినవారిని నిర్దయగా చావనివ్వటాన్కి ఏమాత్రం సంకోచంలేదు.

ఈ భూతం పట్టినవాళ్ళకు మానవ జాతి మీద కాని, ప్రకృతి మీద కాని ఏ మాత్రము గౌరవం ఉండదు. వారిచ్చే గౌరవము మనమెంత ధనికులం అవ్వగలుగుతామనే మార్గాన్ని సుగమం చేసుకోవటమే. అది చట్టబద్ధంగానే కాక అవినీతి ద్వారా కూడా చేయవచ్చనే అభిప్రాయం పెరుగుతోంది.

ప్రపంచంలో ఉన్న జనాభా అందరికీ తిండి, బట్ట, ఇల్లు, ఆరోగ్యం, చదువు అవసరమే. ఈ అవసరాలు అందరికీ తీరాలంటే అందరికీ పని దొరకాలి, అందరికీ పని దొరికే అభివృద్ధి మన సమాజానికి దిక్సూచి కావాలి. ప్రస్తుత అభివృద్ధి నమూనాలో రెండు ప్రధాన రంగాలని మనం తరచి చూద్దాం.

మనము చిన్న, మధ్యతరహా నీటివనరుల ద్వారా వ్యవసాయం చేసే రోజుల్లో విశాల రైతాంగం అంతర పంటలు వేయడయే కాకుండా పంట మార్పిడి ద్వారా భూసారాన్ని వృద్ధి చేసి ఆరోగ్యకరమైన సంపూర్ణ ఆహారాన్ని అందించేవారు దీని స్థానే భారి నీటి పారుదల ప్రాజెక్టులు కట్టి హైబ్రిడ్ విత్తనాల ద్వారా సంవత్సరానికి మూడు పంటలు వేసి వాటికి కావలసిన కృత్రిమ ఎరువులు బాగా వేసి, చీడల కోసం పురుగుల మందు బాగా వాడి భారతదేశంలో వరి, గోధుమ విపరీతంగా పండించారు. దీని పర్యవసానం అత్యధిక నీటికోసం వందల, వేల గ్రామాలను మైళ్ళ కొలదీ అడవులను ప్రాజెక్టుల క్రింద ముంచవలసి వచ్చింది. పౌష్టికాహార పంటలైన జొన్న, మొక్కజొన్న, కంది, మినుము దిగుమతి చేసుకోవలసిన పరిస్థితికి నెట్టివేయబడ్డాం. వరిధాన్యం వాడకం పెరగటంతో భారతదేశం మధుమేహం (చక్కెర) వ్యాధికి కేంద్రమైంది. మందుల మీద ఖర్చు ఎక్కువైంది. పురుగుల మందు వాడకంతో చీడ పీడలతోపాటు, భూమిని గుల్లబార్చే వానపాములతో సహా అన్ని రకాల జీవులు పొలాల నుండి నిర్మూలింపబడటంతో భూములు చవుడు బారిపోయాయి. ఈ పునరుజ్జీవనానికి వేలకోట్ల బడ్జెట్లు కేటాయించవలసిన పరిస్థితులు వచ్చాయి. చిన్న మధ్య తరహా నీటి వనరులలోని మట్టి గృహ నిర్మాణానికో లేదా పొలాలలో ఒండ్రుగానో వాడే వద్ధతి పోవటంతో ఈ వనరులన్ని మాయమైపోయాయి. పూడికలతో పెద్ద పెద్ద ప్రాజెక్టులే నీటి నిల్వలకు సరిపోక ఉన్న నీటికోసం గ్రామాల మధ్య, జిల్లాల మధ్య, ప్రాంతాల మధ్య, రాష్ట్రాల మధ్య ఘర్షణలకు దోహదపడుతున్నాయి.

హైబ్రిడ్ విత్తనాల కోసం, నీటికోసం, ఎరువుల కోసం, పురుగు మందుకోసం పెట్టుబడులు అధికమై గిట్టుబాటు ధర దొరకక రైతుల ఆత్మహత్యలకు దారితీశాయి. చిరవగా ఉత్పత్తిపెరిగే కొలదీ ఉపాధి తగ్గుతోంది.

ఇక రెండవ ప్రధాన రంగం చేనేత పరిశ్రమ : ప్రత్తి పండించడానికి, పండిన ప్రత్తిని సేకరించి దానికి నూలుగా మార్చడానికి, దాన్ని బట్టలుగా మార్చడానికి రంగులు, అద్దకాలు వేయడానికి, నేసిన బట్టలు అమ్మడానికి, విడిచిన బట్టలు ఉతకడానికి, ఇస్త్రీ చేయడానికి ఈ రంగంలో కోట్లమందికి ఉపాధి దొరికేది. దేశ జనాభా నాలుగు రెట్లు పెరిగినా ఈ రంగంలో ఉపాధి తగ్గుతూ వస్తూంది. దీనికి ప్రధాన కారణం మిల్లు బట్టలు, కృత్రిమమైన పాలిస్టర్, టెరిలిన్ మొదలైన వాటి వాడకం పెరగడమే. నూలు బట్టలు వాడినంత కాలం మనదేశ ప్రజలందరికీ గుర్తింపుతోపాటు కోట్లమందికి ఉపాధి దొరికేది. నాడు చర్మవ్యాధులు లేవంటే అతిశయోక్తి కాదు. వేసవికాలం నూలుబట్ట చల్లగాను, శీతాకాలం వెచ్చగాను మనదేశానికి అనువైన వస్త్రం. విదేశాల నుంచి వస్త్రాలని దిగుమతి చేసుకోవటంలోనే మనదేశ స్వాతంత్ర్యం కోల్పాయామని స్వాతంత్ర్యానికి చిహ్నంగా రాట్నంతో కూడిన మూడు రంగుల జెండాను మనదేశ చిహ్నంగా గుర్తించడం జరిగింది. ఈ రోజు రాట్నం స్థానాన్ని ఎవరాక్రమించారో నేను చెప్పను...... అందరం చూస్తున్నాం.

దీనికి తోడు ప్రత్తిలో కూడా హైబ్రిడ్ విత్తనాలు, పురుగుల మందుల ధరలతో, అమ్మకాల ధరలలో విపరీతమైన వ్యత్యాసాలతో నూలు బట్టల ధరలు విపరీతంగా పెరిగాయి. పారిశ్రామిక రంగానికి లక్షలకోట్ల రాయితీలు ఇచ్చే ప్రభుత్వం చేనేత రంగానికి కావల్సిన విత్తనాల దగ్గర్నుంచి, రంగుల దగ్గర్నుంచి పనిచేసే కార్మికుల వేతనాల దగ్గర్నుంచి రాయితీలు ఇవ్వటం ద్వారా మాత్రమే చేనేత రంగం నిలదొక్కుకో గలుగుతుంది. చేనేత ఉత్పత్తి రంగంగా మాత్రమే కాక, ఉపాధి రంగంగా చూడటంతో మనదేశంలో ప్రత్తి రైతులు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు అరికట్టవచ్చు.

పై రెండు రంగాల విశ్లేషణ ధర్మాన్ని ఆచరించి, ప్రకృతిని రక్షించాలనే వారికి సులువుగా అర్థమవుతుంది. కాని నేటి భారతదేశ కేంద్ర ప్రభుత్వ విధానాలు మానవ విలువలకు ప్రకృతి రక్షణకు ఆఖర్కి అన్ని ధర్మాలకే తిలోదకాలు ఇచ్చే విధంగానే ఉంది. గనుల పేరుతో అడవులు నాశనం ఒకవైపు గిరుజనులను తరమటం మరోవైపు జరిగిపోతోంది. ఈ అభివృద్ధి నమూనా మన ప్రభుత్వం పద్ధతిగా జరుపుకుపోవటాన్కి కారణాలేంటి.

1947లో పంచాయితీ ప్రెసిడెంటు దగ్గరి నుండి పార్లమెంటు దాకా సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని అంచెల వారిగా ఎదిగితే ఈరోజు రాజకీయ పార్టీలన్నీ కోటీశ్వరులకే పార్టీ టిక్కెట్‌లు ఇస్తున్నాయి. ముందుతరాల్లో చేనేత బట్టలు వేసుకోవటం సామాజిక కార్యకర్తలందరూ దినచర్యగా భావించేవారు. తాము పుట్టిన గ్రామంలో చిన్ననీటి వనరులను కాపాడటానికి అందరికి ఉపాధి, కల్పించే కుటీర పరిశ్రమలు నెలకొల్పడానికి అందరికి కావల్సిన ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు నిర్మాణం కోసం ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేవారు రాయితీలు పట్టణాల నుండి గ్రామాలకు ప్రవహించేవి. దీనిస్థానే ప్రజలందరి దగ్గర వసూలు చేసిన పన్నులతో పెద్ద పరిశ్రమలకు రాయితీలు ఇచ్చుకుంటూ పెద్ద పెద్ద నిర్మాణపు కాంట్రాక్టులు పుచ్చుకుంటూ ఎన్నికైన ప్రజాప్రతినిధులు కుబేరులు అవుతున్నారు. సామాజిక పరమైన గనులు, క్వారీలు, అడవులు ప్రభుత్వ భూములు ధర చెల్లించకుండానో లేదా అతి తక్కువ ధర చెల్లించో కైంకర్యం చేసుకుంటున్నారు. ఎంగిలి మెతుకులు విసిరినట్లుగా ప్రజలకు ఉచిత పథకాలను, తెల్లకార్డులను, ఆరోగ్యశ్రీ కార్డులను, వితంతు పింఛనులను మొదలైన రాయితీలు ఇచ్చి ఐదేళ్ళకొకసారి వచ్చే ఎన్నికల్లో డబ్బులు పంచి బ్రాంది, విస్కీలు పోయించి పదే పదే ఎన్నికవుతూ పార్టీలు మారైనా అధికారంలో కొనసాగుతున్నారు. ఈ డబ్బులున్న వారి చుట్టూ, అధికారం ఉన్నవారి చుట్టూ తిరిగితే గాని ప్రతి పనికి ప్రభుత్వ అధికారులను డబ్బులిచ్చో, భయపెట్టో, దేబిరించో పనులు చేయించుకోవాల్సిన స్థితికి సామాన్య మానవుడు నెట్టబడ్డాడు. ప్రభుత్వోద్యోగ మంటే పై సంపాదన అధికారం నౌకర్లు, చాకర్లు, చనిపోయేదాకా పింఛనుతో తన జీవనానికే కాక తరతరాల వరకూ సంపాదించవచ్చనే అభిప్రాయం నేడు విశృంఖలంగా ఉంది.

దీనికి పరిష్కారం లేదా? ఈ జాతి విముక్తి ఒక నాయకుడు ద్వారానో, ఒక పార్టీ ద్వారానో సాధ్యపడదు. మొదట అధర్మాన్ని ఎదిరించడం, ఆత్మ గౌరవంతో బతకటం అవసరమని గుర్తించాలి. చేనేత కట్టని, కుటీర పరిశ్రమ వస్తువులు వాడని, విదేశీ వస్తువు వాడకం దారులను ప్రజా రాజకీయ జీవితంలో ఓడించడం ఒకటే మార్గం. దీనితో పాటు అవినీతి ఆరోపణ కేసుల్ని సత్వరం పరిష్కరించి వారి ఆస్తుల్ని ప్రభుత్వం తీసుకుంటారనే భయం, జైలు జీవితంలో అనుభవించటాన్కి ఆస్తులున్నా అనుభవించలేమనే భయం కల్గించే చర్యలు తీసుకునే వ్యవస్థ నిర్మించటాన్కి ఉపయోగపడే ప్రజాప్రతి నిధుల్ని మాత్రమే ఎన్నుకోవాల్సిన అవసరం ఉంది. దీనితోపాటు ప్రతి రూపాయి సంపాదనకే లెక్కలు జెప్పగలిగే నాయకులను ఎన్నుకోవటంలోనే పారదర్శక ప్రజా జీవితాన్ని ప్రారభించగల్గిన రోజే మనకు స్వాతంత్ర్యం సిద్ధిస్తుంది. ధర్మం రక్షించబడుతుంది. ప్రకృతి రక్షించబడుతుంది ముందు తరాలకు ప్రమాద రహిత జీవితాలకు పునాది వేసినవాళ్ళమవుతాము.

\- నారాయణరావు

జ్ఞానం ఏ ఒక్కరి సొత్తు కాదు. ఇతరులను దోచుకోవటానికి పనికొచ్చేది జ్ఞానం కాదు.

# జన్యుమార్పిడి విత్తనాలు ప్రాణాంతకం - మొన్సాంటో వ్యతిరేక ఉద్యమంలో చేతులు కలపండి.

ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రత పేరుతో హైబ్రిడ్ విత్తనాలు నుండి జన్యుమార్పిడి విత్తనాల ద్వారా కూరగాయలు, ధాన్యాలు, పప్పుధాన్యాలు అన్నిటి ద్వారా మానవ జాతి ఏమి తినాలో నిర్ణయించే అధికారం కోసం మొత్తం జాతినే ప్రమాదపు అంచుల్లో నెట్టే ప్రతీ కంపెనీ కూడా మొన్సాంటో కంపెనీ అడుగు జాడల్లో భాగస్వామ్యంతో నడిపే ఈ వ్యాపారాన్ని మానవజాతి మనుగడ దృష్ట్యా ప్రతి ఒక్కరు వ్యతిరేకించాల్సిన అవసరాన్ని గుర్తించి సుమారు 70 దేశాలపైన 2013 అక్టోబర్ 12వ తేదీన ప్రపంచవ్యాప్తంగా మొన్సాంటో వ్యతిరేక ఉద్యమం చెయ్యాలని నిర్ణయం చేశాయి. ఈ సందర్భంలో హైదరాబాద్‌లో అక్టోబరు 2-12 వరకు అవగాహన ప్రచారం మొదలైంది.

**మొన్సాంటో అంటే ఎవరు, ఏమిటి?**

❖ మొన్సాంటో ఒక అమెరికన్ వ్యాపార కంపెనీ. ఇది తప్పుడు ఎత్తుగడలు మోసాలకు పాల్పడి ప్రపంచంలో కెల్లా అతి పెద్ద విత్తన కంపెనీగా తయారయింది. దీని వార్షిక గరిష్ట లాభం 22500 కోట్ల రూపాయలు. ఇది దాదాపు 48 దేశాల గరిష్ఠ గృహ ఉత్పత్తి కంటే ఎక్కువ అంటే ఇది ఎంత పెద్ద కంపెనీగా మారిందో తెలుస్తుంది.

❖ మొన్సాంటో ప్రపంచ వ్యాప్తంగా అనేక నేరాలకు పాల్పడింది - సహజ వనరులను కలుషితం చేయడం, ఏజెంట్ అరెంజ్ వంటి తన రసాయన ఉత్పత్తులతో మనుషులను వికలాంగులను చేయటం, చంపటం, డైఅక్సిన్ వంటి అత్యంత ప్రమాదకరమైన రసాయనాలను సురక్షితమైనవిగా తప్పుడు నివేదికలు ఇచ్చి వక్రీకరించటం వంటివి ఎన్నో చేసింది.

❖ ఇప్పుడు మొన్సాంటో ప్రపంచ వ్యాప్తంగా జన్యుమార్పిడి విత్తనాలను తయారుచేయటానికి 99 శాతం పరిశోధనలను నియంత్రిస్తున్నది. బీటి పత్తి, బీటి వంకాయ వంటి పంటలకు అనుమతులు పొందటం కోసం ప్రభుత్వ అధికారులకు లంచాలిస్తుంది. జన్యుమార్పిడి ఆహారం సురక్షితమైనదే అని తప్పుగా రుజువు చేయటానికి శాస్త్రవేత్తలకు నిధులను అందిస్తున్నది.

❖ రైతులు తరతరాలుగా దాచుకున్న విత్తనాలను ఈ కంపెనీ తీసుకుని వాటిని జన్యుమార్పిడి విత్తనాలుగా మారుస్తున్నది. జన్యు పదార్థంపై పేటెంటు హక్కులతో జన్యు మార్పిడి విత్తనాలను మన జీవావరణంలోకి విడుదల చేయటాన్ని అనుమతినిచ్చినట్లయితే ప్రపంచంలోని విత్తనాలన్నిటిపైన ఈ కంపెనీకి అధికారం ఇచ్చినట్లు అవుతుంది. మనం ఏమి తినాలో ఎంచుకునే స్వేచ్ఛను కోల్పోతాము. మన ఆహారమంతా జన్యు మార్పిడి జీవులతో కలుషితం అవుతుంది. బీటి వంకాయను మన దేశంలో ప్రవేశపెడితే అది అన్ని రకాల వంకాయలను కలుషితం చేసి సాధారణ వంకాయ రకాలు లేకుండా చేస్తుంది. మనం జన్యు మార్పిడి ఆహారాన్ని తప్ప వేరే తిండిని తినే వీలు వుండదు.

❖ జన్యు మార్పిడి జీవులు మనుషుల ఆరోగ్యానికి జీవవైవిధ్యానికి ప్రమాదకరమని ప్రపంచ వ్యాప్తంగా స్వతంత్ర శాస్త్రవేత్తలు నిరూపించారు. అయితే మొన్సాంటో తన శక్తిని ఉపయోగించి అటువంటి నివేదికలను తొక్కిపెడుతున్నది.

**"జన్యు మార్పిడి పంటలు వద్దు - మొన్సాంటో వద్దు"**

మన ఆహార సార్వభౌమాధికారాన్ని కాపాడుకుని, మనం ఏమి పండించాలో ఏమి తినాలో మనమే నిర్ణయించుకునే అధికారాన్ని మన చేతులలో నిలబెట్టుకోవాలంటే

''మొన్సాంటో దేశాన్ని వదిలి పో'' అనే ప్రపంచవ్యాప్త పోరాటంలో చేతులు కలపండి!

''జన్యుమార్పిడి పంటలు వద్దు - మొన్సాంటో వద్దు'' అని రాసిన పోస్టు కార్డును ప్రతి ఒక్కరు భారత ప్రధాన మంత్రికి పంపండి!

మన ఆహార సార్వభౌమత్వాన్ని కబళించటానికి నిరసనగా

అక్టోబరు 12వ తేదిన నిజం కాలేజి నుండి ఇక్రిసాట్ వరకు జరిగే సైకిల్ ర్యాలీలో చేరండి!

సైకిల్ ర్యాలి మార్గం : నిజాంకాలేజి - మాసాబ్ ట్యాంక్ - సిటి సెంట్రల్ మాల్ - బంజారాహిల్స్ రోడ్ నెంబరు 10- బసవతారకం క్యాన్సర్ హిస్పిటల్ - కే.బి.ఆర్. పార్క్ - జూబ్లిహిల్స్ చెక్‌పోస్ట్ - మాదాపూర్ - కొండాపూర్ - మియాపూర్ - చందానగర్ - బిహెచ్ఇఎల్ - పటాన్‌చెరువు - ఇక్రిసాట్.

**ఇక్రిసాట్ ఎందుకు ?**

❖ ఇక్రిసాట్ విదేశీ విధులతో విదేశీయులు నడుపుతున్న వ్యవసాయ పరిశోధన సంస్థ.

❖ ఇక్రిసాట్ ప్రభుత్వ నిధులతో స్థానిక విత్తనాలు, జన్యు పదార్థాలను సేకరించి పరిశోధన చేసి వాటిని ప్రైవేట్ కంపెనీలకు అందజేస్తున్నది.

❖ ''భారతీయ వ్యవసాయాన్ని అభివృద్ధి చేయటానికి'' ఇక్రిసాట్‌కు వేలాది స్థానిక విత్తన రకాలను వందలాది ఎకరాల భూమిని ఇవ్వటం జరిగింది.

❖ ఇక్రిసాట్‌లో జరుగుతున్న పరిశోధనా ఫలితాలను రైతులతో పంచుకోవటం జరగదు. రైతులు విత్తనాలకోసం డిమాండ్ చేసినప్పుడు అక్కడి విత్తనాలు ఇవ్వరు.

''మన రైతులు కాపాడుకున్న విత్తనాలను ఇక్రిసాట్ రైతులకు తిరిగి ఇచ్చివేయాలని డిమాండ్ చేద్దాం!

జన్యు మార్పిడి పంటలపై పరిశోధనలను ఇక్రిసాట్ నిలిపివేయాలి! జన్యు మార్పిడి పంటలపై పరిశోధనలకు మొన్సాంటో సహకారాన్ని నిలిపివేయాలి!

''మొన్సాంటో దేశాన్ని వదిలిపోవాలి''

దీనిలో భాగంగా అక్టోబర్ 2వ తారీఖున హైదరాబాద్‌లోని టాంక్‌బండ్‌పై యోగివేమన విగ్రహం వద్ద ప్లేకార్డులను ప్రదర్శించడం జరిగింది. అక్టోబర్ 3, 4 తారీఖుల్లో నిజాంకాలేజి విద్యార్థులు మొదలైన వానితో పరిశోధనాత్మక కంప్యూటర్ సహాయంతో పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేయడం జరిగింది. అక్టోబర్ 9వ తారీఖున అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన రైతు సంఘాలు, పై సంఘాలు, శాస్త్రజ్ఞులు, పాత్రికేయులతో ఒక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. 12వ తారీఖున నిజాం కాలేజి నుండి ఇక్రిశాట్ వరకు సైకిల్ ర్యాలీ తరువాత ఒక విజ్ఞాపన పత్రాన్ని రాష్ట్రపతికి పంపడం జరుగుతుంది.

- ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక - రైతు స్వరాజ్య వేదిక - సదరన్ యాక్షన్ అన్ జెనెటిక్ ఇంజినీరింగ్ -చేతన సొసైటీ - ఆర్గనైజేషన్ బై యూత్ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫరేషన్, ఎన్విరాన్మెంటల్ రీకూప్, లోకవిద్య జనాందోళన తదితరులు.

# జీవవైవిధ్య వినాశనాన్ని ప్రోత్సహించే కస్తూరి రంగన్‌కు బహిరంగ లేఖ

''వాస్తవం మనం అనుకున్నదానికంటే వింతగా ఉండటమే కాదు మనం ఊహించగలిగిన దానికంటే విచిత్రంగా ఉంటుంది''. 19వ శతాబ్దపు గొప్ప శాస్త్రవేత్త, మానవతావాది, సూయిజ్‌పై బ్రిటిష్ దురాక్రమణను వ్యతిరేకిస్తూ ఇంగ్లాండును వదిలి భారత దేశపౌరుడుగా జీవించిన జెబియస్ హాల్డేన్ అన్నమాటలివి. పశ్చిమ కనుమలపై ఉన్నతస్థాయి వర్కింగ్ గ్రూప్ ఇచ్చిన రిపోర్టుకు మీరు భాగస్వాములవుతారని నేను ఊహించలేక పోతున్నా. కాని వాస్తవం.... మనం ఊహించగలిగిన దానికంటే భిన్నంగా ఉంటుందన్నది నమ్మలేని నిజం.

విస్తృతంగా చర్చలు జరిపి, క్షేత్రస్థాయి పర్యటనలు చేసి పశ్చిమ కనుమలపై మేము పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖకు రిపోర్టు ఇచ్చాం. పర్యావరణ (ఆవరణ) పరంగా సెన్సిటివ్‌గా ఉన్న పశ్చిమకనుమల పరిరక్షణకు అంచెలంచెల పద్ధతిని సూచించాము. అందులో ప్రాథమిక క్షేత్రస్థాయిలో ఒక క్రమపద్ధతిలో చేపట్టే చర్యలు ప్రధానపాత్ర పోషిస్తాయని చెప్పాము. మీరు మేము సూచించిన మొత్తం చట్రాన్నే కొట్టిపారేశారు.

దీనికి బదులుగా పశ్చిమ కనుమలను రెండు ప్రాంతాలుగా విభజించి, ఒక వంతును మాత్రమే సహజ లాండ్ స్కేపుగా పేర్కొని దాని రక్షకభట వ్యవస్థతో పరిరక్షించ వచ్చని చెప్పారు. మిగిలిన రెండొంతులను సాంస్కృతిక లాండ్‌స్కేప్‌గా గుర్తించి అభివృద్ధి కోసం కేటాయించాలన్నారు. మీరు చెబుతున్న అభివృద్ధి వలననే 35 వేల కోట్లరూపాయల గోవా అక్రమ గని తవ్వకాల కుంభకోణం జరిగింది. ఇదెలా వుందంటే ఆవరణ వ్యవస్థ విధ్వంసపు టెడారిలో వైవిధ్యపు ఒయాసిస్‌లను నెలకొల్పే ప్రయత్నంలా ఉంది. ఇలా ముక్కలు ముక్కలుగా చేసి అభివృద్ధి చేయాలనుకోవటం భ్రమే. అతి త్వరలోనే ఈ విధ్వంసపు ఎడారులు ఒయాసిస్‌లను మింగివేయటం ఖాయం. ఆవరణ శాస్త్రం చెప్పే పాఠం కూడా ఇదే. సామాజిక పరంగా, ఆర్థికపరంగా, ఆవరణ శాస్త్రపరంగా చేపట్టే స్నేహపూర్వక విధానాలు, ఉనికిలో ఉన్న ఆవాసాలను కొనసాగించటం, నిలబెట్టుకోవటం ద్వారానే జీవవైవిధ్యంతో నిండి వున్న ప్రాంతాలను పరిరక్షించుకోగలం. దీన్నే మేము జీవవైవిధ్యసంపదతో నిండివున్న ప్రాంతాల దీర్ఘకాల సంరక్షణకు ప్రతిపాదించాము.

పైగా అటవీ జీవవైవిధ్యం కన్నా మంచినీటి జీవవైవిధ్యమే ఎక్కువ ప్రమాదాన్నెదుర్కొంటున్నది. మీరు చెప్పే సాంస్కృతిక లాండ్‌స్కేప్‌లో ఇదే ప్రధానంగా ఉంది. ఎంతోమంది ప్రజలకు జీవనాధారంగా, పోషకాహారాన్నందించే ఏకైక వనరుగా కూడా ఈ మంచినీటి జీవవైవిధ్యం ఉంది. అందుకే మేము మహారాష్ట్రలోనే రత్నగిరి జిల్లాలో నెలకొల్పిన 'లోటే రసాయన పారిశ్రామిక సముదాయం' పై అధ్యయనం చేసి సవివరమైన రిపోర్టును అందించాం. అక్కడి కాలుష్యం చట్టపరమైన అన్ని అవధుల్నీ అతిక్రమించి మత్స్య సంపదను తీవ్రంగా దెబ్బతీయటమేగాక 20వేలమంది ప్రజల ఉపాధిని స్వాహా చేసింది. ఇంతకూ పరిశ్రమల వల్ల వచ్చిన ఉద్యోగాలు కేవలం 11 వేలమందికే. కాని ప్రభుత్వం అదే ప్రాంతంలో మరిన్ని కాలుష్య పరిశ్రమలను నెలకొల్పజూస్తున్నది. పరిశ్రమల ఏర్పాటుకుతానే స్వయంగా ఏర్పరచుకున్న జోనల్ అట్లాసును సైతం కావాలనే తొక్కిపెట్టింది.

మరీ దారుణంగా ఆర్థికపరమైన నిర్ణయాల్లో స్థానిక ప్రజలకు పాత్ర లేదని మీరు చెబుతున్నారు. ఇది మన రాజ్యాంగం గ్యారంటీ చేసిన ప్రజల ప్రజాస్వామిక నిర్ణయాధికారాన్ని త్రోసి రాజనటమే అవుతుంది. చట్టవ్యతిరేకంగా కాలుష్యాన్ని విరజిమ్ముతున్న 'లోటే' పై ప్రభుత్వం ఏ విధమైన చర్య తీసుకోలేదనిమేము చెప్పిన వాస్తవాన్ని కూడా మీరు కావాలనే ప్రస్తావించలేదు. కాలుష్య కారక పరిశ్రమలపై చర్యలు చేపట్టక పోగా కాలుష్యనివారణకై శాంతియుతంగా, న్యాయబద్ధంగా నిరసన తెలిపే వారిపై ప్రభుత్వం పోలీసు లాఠీ ప్రయోగించింది. 2007-09 మధ్యకాలంలో 600 రోజులకుగాను 180 రోజులు ప్రభుత్వ అణచివేత కొనసాగింది.

అమూల్యమైన జీవవైవిధ్య అంశాలకు భారతదేశపు సాంస్కృతిక లాండ్‌స్కేప్ నిలయంగా ఉంది. డెబ్బైఐదు శాతం పెద్దతోక కోలులు (Lion tailed Macaque) ఈ పశ్చిమ కనుమలకే పరిమితమై తేయాకు తోటలో నివశిస్తాయి. నేను పూనే నగరంలో నివశిస్తాను. మా నివాసప్రాంతంలో మర్రి, రావి, గూతార్ వంటి ఫైకస్ జాతికి చెందిన వృక్షాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఆధునిక ఆవరణ శాస్త్రంలో వీటిని అనేక ఇతర జాతులకు నీడనిచ్చే కీలకమైన వనరు (Keystone resource) గా భావిస్తారు. రాత్రుళ్ళు నెమళ్ళ అరుపులు, ప్రొద్దుటే ఇంటి బాల్కనీలోకి వెళ్తే కనువిందు చేసే నెమలి నాట్యాలు మాకు నిత్య దృశ్యాలు. మన దేశప్రజల దృఢమైన సాంస్కృతిక, సంప్రదాయాల్లో ప్రకృతిని గౌరవించడం విడదీయరాని అంశం.

అది మన సంస్కృతిలో వేళ్ళూనుకుని ఉన్నది. అనాదిగా కాపాడబడుతున్న పవిత్ర అరణ్యాలు, ఫైకస్ వృక్షాలు, కోతులు, నెమళ్లు ఇవన్నీ మన ప్రజల సంస్కృతిక నిదర్శనాలు.

ఈ రోజు ఇవన్నీ తుడిచిబెట్టబడుతున్నాయి. ఈ సందర్భంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి ఏజెంట్‌గా ఉన్న ఫ్రాన్సిస్ బుఖ్నాన్ 1801లో రాసిన మాటలు గుర్తుకు వస్తున్నాయి. ఈస్టిండియా కంపెనీకి రావలసిన ఆస్తుల్ని అడ్డుకునేందుకు భారతదేశపు పవిత్ర అరణ్యాలు కేవలం ఒక సాకుగా ఉపయోగపడ్డాయన్నాడు.

ఇప్పుడు మనం బ్రిటిష్ వాళ్ళను మించిన బ్రిటిషర్లుగా మారిపోయాము. అందుకే మీకు ప్రకృతితో స్నేహ పూర్వక పద్ధతిలో జీవవైవిధ్య పరిరక్షణ కూడా దేశ విదేశాల ధనికులను, శక్తివంతులను అడ్డుకునే ఒక మిషగా కన్పడుతున్నది. అవును మరి ఈ ప్రపంచీకరణ యుగంలో మన భూములను, నీటినీ దోపిడీ చేయటాన్ని విచ్చలవిడిగా కాలుష్య విషం విరజిమ్మటాన్ని ఉపాధిలేని ఆర్థికాభివృద్ధిని స్వాగతించవలసిందే! మీ రిపోర్టు ఈ విధ్వంసక అభివృద్ధికి గొప్ప కితాబు నివ్వటాన్ని నమ్మలేకుండా ఉన్నాను. ''నిజం మనం ఊహించగలిగిన దానికన్నా భిన్నంగా ఉంటుంది మరి''!

**- ఆచార్య మాధవ్‌గాడ్గిల్, జీవవైవిధ్య విభాగం, పూనే**

వ్యక్తిత్వ వికాసానికి సమాజంలో అందరికి ఉపయోగపడేది జ్ఞానం.

# 'చేనేత' నిర్వచనం మార్పు - చేనేతరంగ వినాశనానికి బాట

కేంద్ర ప్రభుత్వం ఈ సం॥రం మార్చి నెలలో ఢిల్లీలో జరిగిన కేంద్ర జౌళీ మంత్రిత్వశాఖ సమావేశంలో 'చేనేత' నిర్వచనం మార్పుకై ప్రతిపాదన రాగా వివిధ రాష్ట్రాల నుండి చేనేతరంగ ప్రతినిధులు తీవ్రంగా స్పందించారు. ఈనాడు చేనేతరంగ రిజర్వేషన్లు సక్రమంగా అమలుచేయకపోవడం, మరమగ్గాల ఉత్పత్తులను చేనేత పేరుతో అమ్మడం వంటివి చేనేత రంగంపై ప్రతికూల ప్రభావం చూపిస్తున్నాయని, ఎన్‌పోర్స్‌మెంటు విభాగం పటిష్టంగా వుండాలని చేనేత ప్రతినిధులు గట్టిగా కోరడం జరిగింది. ఆనాటి సమావేశంలో సామరస్యంగా మాట్లాడి అనంతరం చేనేత రిజర్వేషన్ చట్టం పై సబ్‌కమిటీ నియమిస్తూ 'చేనేత' నిర్వచనం మార్పును పరిశీలించాలని తమిళనాడు ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, అస్సాం, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, డైరెక్టర్లు సభ్యులుగా ఒక మరమగ్గాల ప్రతినిధి కలిపి 11 మందితో సబ్‌కమిటీని నియమించారు.

ఈ అధ్యయనంలో ఈ క్రింది షరతులపై ఆధారపడి పరిశీలన చేయాలని సూచించారు.

1) దేశంలో ప్రస్తుతం అమల్లో వున్న వివిధ రకాల మగ్గాలను పరిశీలించడం.
2) ఇప్పటి వరకు ఆధునీకరణ, యాంత్రీకరణ అయిన తీరు. మరింత అభివృద్ధికి వున్న అవకాశాలు నాణ్యతతో రాజీ పడకుండా చేనేతల శ్రమ తగ్గించే అవకాశాలు.
3) ముఖ్యమైన కొన్ని పనులు యాంత్రీకరించడం ద్వారా శ్రమను తగ్గించడం.
4) జౌళీ రంగంలో మారిన పరిస్థితులలో 'చేనేత' నిర్వచనం మార్పుకు సూచనలు.
5) చిన్న తరహా మరమగ్గాల వారిని ప్రత్యేక గ్రూపుగా పరిగణించి చేనేత కార్మికులతో సమానంగా కొన్ని సౌకర్యాలు కల్పించడం.

ఈ ప్రతిపాదనల సారాంశం చేనేత, మరమగ్గాల ఉత్పత్తులను సమానం చేసి ఇప్పటి వరకు అనధికారికంగా చేనేత పేరుతో మార్కెట్ చేస్తున్న మరమగ్గాల ఉత్పత్తులకు చట్టబద్ధత కల్పించడమే. శ్రమ తగ్గించడం అనే పేరుతో మగ్గానికి మోటార్స్ బిగించడం, ఉత్పత్తిని అధికం చేయడం పేరుతో కొన్ని మార్పులు ప్రవేశపెట్టడం చేనేతను శాశ్వతంగా సమాధి చేయడమే. చేనేతను ఉపాధిరంగం నుండి పూర్తిగా తొలగించి ఉత్పత్తి రంగంగా మార్చి పెట్టుబడుదారులకు లాభాలను కల్గించడమే దీని ముఖ్య ఉద్దేశ్యం.

శివరామన్ కమిటీ ఒక మరమగ్గం 7 చేనేత మగ్గాలు మూతపడతాయని చెప్పిన విషయం, తెలంగాణా ప్రాంతంలో మరమగ్గాల ప్రవేశంతో చేనేత మగ్గాలు పూర్తిగా అటకెక్కాయి. అయితే మరమగ్గాన్ని ఆధునీకరించి జెట్‌లూం ప్రవేశంతో ఒక జెట్‌లూంతో 80 మగ్గాలు మూతపడ్డాయి. చేనేతలో చెయ్యి, మగ్గం ప్రధానం. స్విచ్ వెయ్యటానికి చెయ్యి, నేతనేయటానికి మగ్గం ఉండే పవర్‌లూమ్‌లు, జెట్‌లూంలు కూడా చేనేత అనే వర్గీకరణ చేయటానికే ప్రభుత్వం చేనేత నిర్వచనాన్ని మార్చటానికి ప్రయత్నం.

చేనేత మగ్గాన్ని మరమగ్గం దెబ్బతీస్తే, మరమగ్గాన్ని జెట్‌లూం దెబ్బకొట్టింది. మరమగ్గాల కార్మికులు ఆకలిచావులకు గురవడం దీనినే సూచిస్తుంది. ఈనాడు ప్రభుత్వం తీసుకొచ్చే ప్రతిపాదనలు కార్పోరేట్ లాబీ వత్తిడితో చేనేత, మరమగ్గాలను దెబ్బకొట్టే కార్పోరేట్ విధానం తప్ప వేరు కాదు. చర్మాస్, వాల్ మార్ట్, లాంటి సంస్థలు బంగ్లాదేశ్‌లో బాలకార్మికులని దోపిడి చేసి చైనా, ఇండియా లాంటి చోట్ల ప్రత్యేక ఆర్థిక కేంద్రాల్లో ఏ హక్కులు లేకుండా ప్రతీరక్తం బొట్టును పీల్చి తెగబలిసిన దనమధాందుల మార్కెట్ ప్రయోజనాలకోసం ఈ మార్పులు జరుగుతున్నాయి. మరమగ్గాల కార్మికులను ఉద్ధరించే పేరుతో జరిగే మార్పులు వారికే మాత్రం ఉపయోగపడవు. కావున మరమగ్గాల కార్మికులు, చేనేత రంగంలో ప్రవేశించి, సమిష్టిగా అంతర్జాతీయ మార్కెట్ విస్తరణను అడ్డుకొని స్వదేశీ ఉద్యమంలో స్థానిక మార్కెట్ అభివృద్ధిలోనే వారి భవిష్యత్ సాధ్యం. నిజమైన చేనేతలో ఏమాత్రం విద్యుత్ శక్తి వాడినా దాని స్వరూపం మారిపోతుంది కనుక వినియోగదారులు నిఖార్సైన చేనేత బట్టలు వాడకంలోనే సమాజ భవిష్యత్ నిక్షిప్తమై ఉంది.

అధికారపార్టీ, ప్రతిపక్షపార్టీల అభివృద్ధి నమూనా ఒకటే అయినందున మగ్గాలకు చిన్న మోటారు బిగిస్తే శ్రమ తగ్గుతుందనే వైఖరి అంతిమంగా చేనేతకు ఉరితాడు అవుతుంది. చేనేత ప్రయోజనాలు స్థానిక మార్కెట్‌ల పరిరక్షణ, విదేశీ ఉత్పత్తుల బహిష్కరణ దిశగా కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా తమ పోరాటాన్ని ఎక్కుపెట్టాలి. ఈ లక్ష్యం లేకుండా ఎన్ని సమైక్య పోరాటాలు చేసినా అవి లక్ష్యాన్ని సాధించలేవు. చేనేత రంగం అభివృద్ధి నమూనాని నిర్వచించుకొని కుటీర పరిశ్రమ అభివృద్ధి దిశగా ఉద్యమించాలి.

**- మాచర్ల మోహన్‌రావు**

# సాగునీటి జలాశయాల్లో చేరుతున్న పూడిక - తగ్గిపోతున్న నీటి నిల్వ సామర్థ్యం

బారీనీటి పారుదల ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలుగా వర్ణించిన అభివృద్ధి విధానంలో భాగంగా నిర్మించిన శ్రీశైలం, నాగార్జునసాగర్, శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులు వాటి జీవితకాలం పూర్తికాకుండానే డిజైన్ చేసిన దానికి భిన్నంగా పెద్ద ఎత్తున పూడిక పెరిగి రిజర్వాయర్లు సామర్థ్యం కోల్పోతున్నాయి. ప్రపంచంలో ఇంతవరకు పూడిక తొలగించే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏదేశంలోనూ అభివృద్ధి చేయలేదు. పూడిక తొలగించడం కొరకు జరిపే వ్యయంతో పోలిస్తే కొత్తగా మరో ప్రాజెక్టు నిర్మించడం చవక అని నిపుణులు తేల్చారు. ఈ విషయంలో చైనా ఈ మధ్యకాలంలో కొత్త ప్రయోగానికి పూనుకొంది. రిజర్వాయర్లలో బారీ మోటర్లతో పెద్ద ఎత్తున నీటిని వరదలా పారించడంతో భూమిలోని పూడిక నీటిలో కలిసి బయటకు రావడం జరిగింది. దీని ఫలితాన్ని విశ్లేషించాల్సి వుంది. ఈ నేపథ్యంలో అభివృద్ధిలో భాగంగా వున్న ప్రాజెక్టులలో పూడిక ప్రధాన సమస్యకాగా, ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయిన తరువాత నిర్వహణకు ప్రతీ ఏటా నిధులు కేటాయించ కూండా నిర్లక్ష్యం వహించడం ద్వారా శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి మరమ్మత్తులకు ఆధునీకరణ పేరుతో వేలకోట్ల రూపాయలు ప్రపంచ బ్యాంక్, జపాన్ అంతర్జాతీయ సంస్థల నుండి అప్పులు తెచ్చి, రుణదాతల షరతుల ఆధారంగా ప్రైవేటీకరణకు దారులు తెరిచారు. ఒక్కమాటలో రిజర్వాయర్లను తాకట్టు పెట్టి సాగునీటికి, త్రాగునీటికి మీటర్లు పెట్టి నీటిని అమ్ముకోవడం ద్వారా అప్పులు చెల్లించేందుకు పాలకులు ప్రణాళికలు రచిస్తున్నారు. పూడిక చరిత్ర ఇలా వుంది.

**శ్రీశైలం ప్రాజెక్టు** : నీలం సంజీవరెడ్డి సాగర్ (శ్రీశైలం ప్రాజెక్టు) రెండు కొండల నడుమ కృష్ణానదిపై 1976లో నిర్మించారు. దీని క్యాచ్‌మెంట్ విస్తీర్ణం 2.06 లక్షల చ.కి.మీ. దీని పూర్తి సామర్థ్యం 308 టి.యం.సిలు. శ్రీశైలం ప్రాజెక్టు విద్యుత్ ఉత్పాదన కోసం నిర్మించడం జరిగింది. శ్రీశైలం కుడి కాలువ, (19 టి.యం.సిలు), కర్నూలులో 3 తాలుకాలు, కడపజిల్లాలోని ఒక తాలుకాలో 1.90 లక్షల ఎకరం ఆయకట్‌కు సాగునీరు కేటాయించారు. శ్రీశైలం ఎడమ కాలువ ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు ద్వారా నల్గొండ జిల్లాలో వరదకాలంలో మిగులు జలాలపై ఆధారపడి నిర్మించారు.

1997లో పూడిక సర్వే నిర్వహించినప్పుడు 45 టి.యం.సి.లు సామర్థ్యం తగ్గింది. అనగా సంవత్సరానికి 0.82% పూడిక పెరిగింది. సంవత్సర పూడిక 0.5 శాతం మించితే ప్రమాదకరస్థాయిగా పరిగణిస్తారు. 2013కు మరో 6 టి.యం.సి అనగా 51 టి.యం.సి తగ్గి వుంటుంది.

సాధారణంగా గోదావరి కన్నా కృష్ణానది కొండప్రాంతాలు, దట్టమైన అడవి గుండా ప్రవహించడం వలన పూడిక శాతం తక్కువ అని నిపుణుల అభిప్రాయం. కేంద్ర నీటి కమీషన్ (సి.డబ్ల్యు.సి.) ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ ప్రయోగశాలలు (ఎ.పి.ఇ.ఆర్.ఎల్) హైడ్రోగ్రాఫిక్, రిమోట్ సెన్సింగ్ సర్వేలు నిపుణులను దిగ్భ్రాంతికి గురిచేసింది. విచ్చలవిడిగా అడవులు నరకడం, రిజర్వాయర్ పైన భూమి అభివృద్ధి, వ్యవసాయం వంటివి పూడిక శాతం పెరగడానికి దారితీసివుండొచ్చని భావిస్తున్నారు. పూడిక వలన నీటిమట్టం పడిపోవడంతో 1740 మె.వా. విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం కల్గింది. వర్షాలు సరిగా కురవని కాలంలో విద్యుత్ ఉత్పత్తి మూతపడడం సాధారణం.

**నాగార్జునసాగర్ ప్రాజెక్టు** : బహుళార్థ సాధక నాగార్జునసాగర్ ప్రాజెక్టు 1955 లో నల్గొండ జిల్లా నందికొండ దగ్గర కృష్ణానదిపై ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియా 2.15 లక్షల చ.కి.మీ. అత్యధిక వరద ప్రవాహం 10.61 లక్షల క్యూసెక్కులుగా అంచనా వేశారు. దీని పూర్తి సామర్థ్యం 408 టి.యం.సిలు. కుడి, ఎడమ కాలువలు, ప్రాజెక్టులో 360 మె.వా. విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. కుడి కాలువ జవహర్ కాల్వ కింద 10 నుండి 11 లక్షల ఎకరాలు, ఎడమ కాల్వ లాల్‌బహదూర్ కాల్వ కింద 8.5 నుండి 9.5 లక్షల ఎకరాలు మొత్తం 20 లక్షల ఎకరాలు నల్గొండ, ఖమ్మం, గుంటూరు, ప్రకాశం, కృష్ణా మరియు పశ్చిమగోదావరి జిల్లాలో సాగవుతుంది.

భారీనీటి పారుదల శాఖా మంత్రి పి. సుదర్శన్‌రెడ్డి 2012లో రాష్ట్ర అసెంబ్లీలో 2009-10లో ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ పరిశోధన శాల జరిపిన సర్వేలో 20 శాతం పూడిక ఏర్పడినట్లు ప్రకటించారు. అనగా 408 టి.యం.సిల సామర్థంలో 80 టి.యం.సి. పూడిక ఏర్పడడం వలన గత 45 సంవత్సరాలలో 20 శాతం సామర్థ్యం కోల్పోయిందని ప్రకటించారు. కేంద్ర జలసంఘం (సి.డబ్ల్యు.సి) ప్రకారం బాతి మెట్రిక్ సర్వే ఆధారంగా 120 టి.యం.సిలు సామర్థ్యం కోల్పోయిందని తేల్చారు. అనగా నాగార్జునసాగర్ సామర్థ్యం 288 టి.యం.సిలకు తగ్గింది.

గతంలో చేసిన అధ్యయనం ప్రకారం కల్నల్ ఎలీస్ లెక్కల ప్రకారం నాగార్జునసాగర్‌లో గేట్ కింది డెడ్ స్టోరేజి 164 టి.యంసిలు. దీని జీవితకాలం 370 సం॥లగా తేల్చారు. ఇదే శ్రీశైలం ప్రాజెక్టులో 158 టి.యం.సిలు డెడ్ స్టోరేజి వుంది. రిజర్వాయర్ జీవితకాలం 300 సం॥లుగా నీటిపారుదల శాఖ ఇంజనీర్లు నిర్ధారించినా పై అధ్యయనాలు పూడిక తీవ్రతను తెలియచేస్తున్నాయి.

**నిజాం సాగర్ ప్రాజెక్టు** : నిజాంసాగర్ ప్రాజెక్టు నిజామాబాద్ జిల్లాలో అచ్చంపల్లి గ్రామం వద్ద మంజీరా ఉపనదిపై 1923లో నిజాంకాలంలో నిర్మించారు. దీని క్యాచ్‌మెంట్ ఏరియా 21694 చ.కి.మీ. రిజర్వాయర్ సామర్థ్యం 11.80 టి.యం.సిలు. ప్రాజెక్టులో అత్యధిక వరద 5.25 లక్షల క్యుసెక్కులని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టు కింద 2.75 లక్షల ఎకరాలు నిజామాబాద్ జిల్లాలో సాగయ్యేది. పూడిక తీవ్రత వల్ల సామర్థ్యం కోల్పోవడంతో ఆధునికీకరణ కింద రిజర్వాయర్ ఎత్తును 426.87 నుండి 428.24 మీ. కు పెంచడం ద్వారా దీని సామర్థ్యం 11.8 టి.యం.సి నుండి 17.8 టి.యం.సిలకు పెంచారు. గత 40 సం॥ర కాలంలో బారీగా పూడిక ఏర్పడడంతో 60 శాతం నిల్వ సామర్థ్యం కోల్పోయింది. ప్రస్తుతం వస్తున్న పూడిక శాతం కొనసాగితే 70 సం॥రాలలోనే ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం కోల్పోతుంది.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు : శ్రీరాంసాగర్ (పోచంపాడు) ప్రాజెక్టు గోదావరి నదిపై నిజామాబాద్‌జిల్లాలో 1963లో ప్రారంభమైంది. ఈ ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియా 91,751 చ.కి.మీ. 16 లక్షల వరద ప్రవాహంకుడిజైన్ చేశారు దిగువ మానేరు ప్రాజెక్టు, 284 కి.మీ. పొడవుగల కాకతీయ కాలువ, 77 కి.మీ. సరస్వతీకాలువ, 3.5 కి.మీ లక్ష్మి కాలువ కింద 12 లక్షల ఎకరాల ఆయకట్‌కు నీరందించే లక్ష్యంతో చేపట్టారు. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ నల్గొండ జిల్లాలలో కాకతీయ కాలువ కింద, సరస్వతి, లక్ష్మికాలువల కింద అదిలాబాద్ జిల్లాలకు సాగునీరందుతుంది.

1992లో రిజర్వాయర్ సామర్థ్యం 112 టి.యం.సిల నుండి 90 టి.యం.సిలకు తగ్గిపోయింది. పూడిక శాతంపై వివాదం వచ్చి మరల సర్వే చేసి పూడిక శాతం తగ్గిందని పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంక్ నుండి రుణాలు పొందడం కోసం పూడికను తగ్గించి చూపారని వివాదాలున్నాయి.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ప్రారంభించి 50 సం॥లయినా పూర్తి స్థాయిలో ఆయకట్‌కు నీరందడంలేదు. ప్రాజెక్టు కింద 2వ పంటకు, అది మెట్టపంటకు నీరివ్వాల్సి వున్నా ఆచరణలో వరి పంటనే వేస్తున్నారు. మొదటిదశ కింద 5 నుండి 6 లక్షల ఎకరాలకు మించి సాగునీరందడంలేదు. ప్రాజెక్టు నిర్మాణంలో

(మిగతా భాగం 4వ పేజిలో)

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. A.P.- 60
Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. A.P.-500 060.

RNI Regd. No. APBIL/2012/50668 Postal Regn. No. HSE/677/2013-2015



## ہندوستان کی عوام اور اسکی کرپٹ — حصہ ۱۱

جس ملک میں علم کے اداروں میں بے ایمانی کا بسر ہو تو سوچئے طلبوں کا کیا حشر ہوگا؟ ملک کے مستقبل کا کیا ہوگا ؟ کیونکہ آج کے طالب کل ملک کو چلانے والے ہیں۔ سال کے بیچ اور آخر میں جو امتحان ہوتے ہیں انمیں نکل کرنے کی اجازت دی جاتی ہے اور اس طرح سے طلبوں کو بے ایمانی کا سبق سکھایا جاتا ہے پیشہ ور علم کے اداروں میں تعلیم اس طرح سے دی جاتی ہے طلبوں کو معقول میں کوئی دلچسپی نہیں رہ جاتی جس وجہ سے وہ گھر سے کالج کا رخ تو کرتے ہیں لیکن کہیں اور چلے جاتے ہیں، یا پھر کالج میں ہی مستی کرتے رہتے ہیں۔ ایسے میں کالجوں میں تو علم حاصل کرنے کی کوئی سبیل رہ سکتا ہی نہیں ہے ۔

علم عطا کرنے والے اداروں کے لئے کوئی نظام موجود ہے لیکن سب حداروں کی ملی بھگت سے اسکو برخاست کر دیا گیا ہے۔ جلد سے جلد اور جیادہ سے جیادہ پیسا کمانے کی چکر میں سب نے آنکھیں موند لی ہیں۔ سب سے بڑے ملک کی بات یہ ہے کہ پیشہ ور کالجوں میں جتنی سیٹیں طلب کرائی گئی ہیں اتنے طالب موجود نہیں ہیں۔ پھر بھی انسے داخلے کے لئے الگ سے استعمالات کیے جاتے ہیں کیونکہ معملا پیسے کمانے کا ہے اور اس لوٹ کو سیاستدان سے لیکر چپراسی تک سب ہڑپ کرتے ہیں۔ آخریں جماعت کے امتحانات کا مقر کوئی مطلب ہی نہ رہ گیا ہوا حال ایسا ہے کہ ایک ناکارہ سے ناکارہ طالب بھی ان پیشہ ور

کالجوں میں داخلہ لے سکتا ہے! میڈیکل کالجوں کا بھی یہی حال ہے۔ اگر آپکے پاس لاکھوں دینے کی سورت ہے تو کہیں داخلہ لے سکتے ہیں۔

پھر آپ پیشہ ور بننے کے بعد کسی مریض کی جان لیں یا ایک ایسی بیہودہ عمارت بنائیں جو گر کر سینکڑوں کی جان لے؛ پھر بوجھ گوجھ جاتی رہیگی لیکن پیسا تو سب ملکر بانٹ لیے! اس میں کوئی حیرت کی بات نہیں ہے کیونکہ جس ملک کی سمت میں محروم ہوں ذہیل اور کیا ہو سکتا ہے ؟

(3వ పేజి తరువాత)

నిధుల కేటాయింపులో జాప్యం వలన 50 సం॥రాలు పూర్తయినా 2వ దశ కింద నీరందకపోవడం వలన ప్రాంతాల మధ్య అసమానతలకు ఈ ప్రాజెక్టు నమూనాగా చెప్పవచ్చు. 1974లో వెంగళ్రావ్ ముఖ్యమంత్రిగా వున్న కాలంలో కాకతీయ కాల్వ ఎత్తును 80 మీ. తగ్గించి దిగువప్రాంతం నుండి కాల్వ మార్గంను మార్చడం వలన ఖమ్మంజిల్లాకు లబ్ది చేకూర్చారు. దీనివలన కరీంనగర్ జిల్లాలో ఎగువప్రాంతంలో 4 లక్షల ఎకరాలు నీరందకపోవడంతో, ప్రజల వ్యతిరేకతను తగ్గించడానికి శ్రీరామ్‌సాగర్ నుండి వరద కాల్వను రూపొందించడం జరిగింది.

రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా అభివృద్ధిని భూతద్దంలో చూపిస్తున్న పాలకులు ప్రాజెక్టుల ఎగువ భాగంలో అటవీ ప్రాంతాలను సంరక్షించడం, భూమికోతకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టకపోవడం, భారీ నిర్మాణాలు, రియల్ ఎస్టేట్ వలన రిజర్వాయర్లలో పూడిక ఏర్పడి తక్కువ కాలంలో వాటి సామర్థ్యం కోల్పోయి అన్ని ప్రాజెక్టులు బ్యారేజిలుగా మారిపోయాయి. ఈ విషయాన్ని ముందే గ్రహించిన బ్రిటీష్ ఇంజనీర్లు కృష్ణా, గోదావరి నదులపై ఆనకట్టలు నిర్మించి కాల్వల ద్వారా నీరు మళ్లించారు. నేటి కాలంలో కూడా అనేకమంది ఇంజనీరింగ్ మేధావులు నదులపై ఆనకట్టలు నిర్మించి నీటిని మళ్ళిస్తే ముంపు సమస్యలుండవని చెప్పినా అంతర్జాతీయ మార్కెట్ ప్రయోజనాల కనుగుణంగా భారీ ప్రాజెక్టులు, ఎరువులు, పురుగుమందులు, ఆకుపచ్చ విప్లవం పేరుతో విధ్వంసకరమైన అభివృద్ధి విధానాన్ని అమలుచేశారు. 1984 నుండి నీటి వినియోగదారుల సంఘం పేరుతో పంటకాల్వలకు మీటర్లు పెట్టి నీరు అమ్మాలన్న పథకం ఆచరణలో రైతుల వ్యతిరేకతతో బెడిసికొట్టింది. నీటి సంఘాల అధ్యక్షుల పదవులు రాజకీయ అధికారం, ఆధిపత్యం కోసం కేంద్రంగా మారింది తప్ప రైతులకు అధికారం రాలేదు. ప్రాజెక్టు కమిటీలు ఏర్పడితే ప్రత్యామ్నాయ అధికార కేంద్రాలు తలెత్తి తమ ఉనికి దెబ్బతింటుందని పాలకులు నిలిపివేశారు.

ఈ నేపథ్యంలో నేడు నిర్మించిన ఆధునిక దేవాలయాల నిర్వాహణకు అవసరమైన నిధులు లేక శిథిలమవుతున్న స్థితిలో వున్నాయి. నేటి ప్రైవేటీకరణ యుగంలో అప్పులిచ్చే ఆర్థిక సంస్థలు సాగునీరు, త్రాగునీరు అమ్ముకునేందుకు పెద్ద పెద్ద కార్పోరేట్ కంపెనీల పరమయ్యే పరిస్థితి వుంది. అప్పుడు రైతుల పరిస్థితి ఇంకా దయనీయమయ్యే స్థితి ఏర్పడుతుంది.

ఈ పరిస్థితి నివారణకు రైతులే ముందు కొచ్చి నీటిసంఘాలుగా ఏర్పడి ఆయా ప్రాంత నీటి వనరుల అభివృద్ధి, నిర్వహణ వారిచేతిలోకి తీసుకొని సమిష్టి నిర్వహణద్వారా బాగుచేసుకునేందుకు ముందుకు రావాలి. ఇకనుంచైనా భారీ ప్రాజెక్టుల నిర్మాణంస్థానే బ్యారేజీలు, ఆనకట్టలు నిర్మించి, చిన్ననీటి వనరులను ప్రాధాన్యం ఇవ్వటంద్వారా త్రాగునీటి, సాగునీటి సమస్యలను శాశ్వతంగా తీర్చవచ్చని పర్యావరణ శాస్త్రవేత్తల సలహాలను ఆచరించడంలోనే నూతన అభివృద్ధి నమూనాను ఆవిష్కరించకలుగుతామనే దాంట్లో ఎటువంటి సందేహాలు లేవు.

\- కె.జె. రామారావు

### మీకు తెలుసా!

**విశాఖపట్నం గిరిజన అభివృద్ధి సంస్థ చింతపండు సేకరణ కనీసం మద్దతు ధర కేజీ. 30/- రూపాయలు ఇవ్వాలని ప్రదర్శన ఒక్కపక్క జరుగుతూవుంటే బహిరంగ మార్కెట్‌లో కేజీ. చింతపండు 80/- రూ॥లకు, చింతపండు గుజ్జును కేజీ. 150/- రూ॥లకి. ఇదే అంతర్జాతీయ మార్కెట్‌లో కేజీ. 3200/- రూ॥లకు అమ్ముతున్నారని మీకు తెలుసా!**

**\- తటవర్తి నారాయణరావు**

**జ్ఞానం లాభాపేక్ష కోసం పరిశ్రమ కారాదు**

**జ్ఞానం సమాజంలోనుంచే ఉద్భవిస్తుంది.**

మా సంస్థ గురించి మరియు పాత పత్రికల గురించి చూడవల్సిన
వెబ్ పేజీ : Loka Vidya blogspot vidyaashram
**http : // www.vidyaashram.org/lokavidya_prapancham.html.**
**http : // vidyaashram.org/papers/LJA-Announcement_Telugu.pdf**

**BOOK - POST PRINTED MATTER**
**16 OCTOBER - 2013**

**To**

వ్యాసాలు, ఉద్యమ వార్తలు పంపించవలసిన చిరునామా :
**Loka Vidya Prapancham**
**D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters,**
**Saroornagar (M), R.R. Dist. A.P.- 500 060 Ph : 040-24152155**
**e-mail : tnrkoundinyasa@yahoo.com**

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. A.P.- 60
Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. A.P.-500 060.